ప్రజాశక్తి
ఆదివారం 30 ఏప్రిల్ 2023 5 అనంతపురం

కిందపడిన పెన్న అహోబిలం తేరు

అతిథులెక్కువ.. వసతులు తక్కువ..!

◆ సైబేరియన్ పక్షులకు తప్పని తిప్పలు ◆ అటవీశాఖ చోద్యం



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జనవరి వచ్చిందంటే చాలు సైబేరియన్ పక్షులు అతిథుల్లాగా ఈ ప్రాంతానికి విచ్చేస్తాయి. తిరిగి వర్షాకాలం మొదలవగానే మరో ప్రాంతానికి పయనమై వెళ్లిపోతాయి. అందుకే ఈ ప్రాంతానికి వచ్చే అతిథులుగా పక్షులను పిలుచుకుంటూ ఉంటారు. సత్యసాయి జిల్లాలోని చిలమత్తూరు మండలంలోని వీరాపురం సైబేరియన్ పక్షుల విడిది కేంద్రంగా పిలుచుకుంటారు. ఈ పక్షులు సైబేరియన్ ప్రాంతం నుంచి వస్తాయని చెబుతున్నప్పటికీ కచ్చితంగా అక్కడి నుంచే అని చెప్పలేం. దేశంలోనే ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నట్టుగా పర్యావరణవేత్తలు చెబుతుంటారు. పెద్ద ఎత్తున పక్షుల వలన ఈ ప్రాంతం పర్యాటక కేంద్రంగానూ ప్రసిద్ధి. పెద్ద సంఖ్యలోనే పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు వచ్చి వీటిని చూసి వెలుతుంటారు.

ఈ ఏడాది అధికంగా వచ్చిన పక్షులు

వరుసగా రెండు సంవత్సరాలుగా జిల్లాలో మంచి వర్షాలు పడ్డాయి. దీంతో పక్షులు విడిది ఉండే చిలమత్తూరు మండలంలోనూ వీరాపురం, వెంకటాపురం చెరువుల్లోనూ నీరు పుష్కలంగా ఉంది. నీరు పుష్కలంగా ఉండటంతో ఈ ఏడాది పక్షులు కూడా ఎక్కువగానే ఇక్కడికి వచ్చినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా రెండు వేల వరకు వచ్చే పక్షులు ఈసారి నాలుగు వేలకుపైగా వచ్చాయి. ఈ పక్షులు సాధారణంగా ప్రాంతానికి జనవరి నెలలో

వస్తాయి. వచ్చి చెట్లపైనా గూళ్ల ఏర్పాటు చేసుకుని వాటిల్లో గుడ్లు పెట్టి పొదుగుతాయి. ఈ పక్షులకు కొంత పెద్దగా అయిన తరువాత జూన్ నుంచి జులై మాసంలో తిరిగి పయనమైపోతాయి. ఒక్కో పక్షి సగటున నాలుగైదు గుడ్లు పెడుతుంది. వీటిల్లో మూడు పక్షుల వరకు పొదుగుతుంది. ఈ రకంగా ఈ ఏడాది పిల్ల, పెద్ద పక్షులు అన్నీ కలిపి పది వేల వరకు అయినట్టు అంచనా. ఇంత పెద్దఎత్తున పక్షులు రావడం ఒకింత సంతోషించదగ్గ విషయం కాగా వాటి ఆహార సమస్య, సంరక్షణ సమస్యగా మారింది.

ఆహారం సరిపడక పక్షుల అరణ్యరోదన

పిల్లలను పొదిగి పెద్దగ చేసే క్రమంలో ఆహారం అధికంగా పక్షులకు అవసరమవుతోంది. ఒక్కో పక్షికి సగటున 500 గ్రాముల వరకు ఆహారాన్ని తీసుకుంటుంది. ఇందులో 90 శాతం వరకు చేపలే ఉంటాయి. తక్కినవి చూస్తే కప్పలు, పాములూ ఉంటాయి. పక్షులు ఈ ఏడాది అధిక కావడంతో ఆహారం కొరత సమస్య వాటికి ఏర్పడుతోంది. దీంతో ఆహారం లేక కొన్ని పక్షులు ఎగరలేక కిందపడిపోతున్నాయి. వీటి సంరక్షణ చేపట్టాల్సిన బాధ్యత అటవీ శాఖ చూడాల్సి ఉంది. కాని అటవీశాఖకు నిధుల కొరత వెంటాడుతున్నట్టు సమాచారం. దీంతో పక్షుల సంరక్షణ ఆగమ్య గోచరంగానే మారింది. దీని కోసం ప్రత్యేకంగా నియమించిన వేణుగోపాల్‌రెడ్డి అనే వాచ్ వార్డుయే ప్రకృతి ప్రేమికుల సహకారంతో వాటిని సంరక్షించే బాధ్యత చూస్తున్నారు. గతంలో వీటి సంరక్షణ కోసం రూ.80 లక్షలతో ప్రత్యేక ప్యాకేజీ కోసం ప్రతిపాదనలు పంపారు.

కుప్పకూలిన పెన్నఅహోబిలం రథం

మరమ్మతులు చేస్తుండగా ఘటన

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్న అహోబిలంలో రథం(తేరు) శనివారం నాడు కుప్పకూలి కిందపడింది. మే 2వ తేదీన బ్రహ్మోత్సవాల ప్రారంభానికి సంబంధించి శ్రీ లక్ష్మీనరసింహస్వామి రథాన్ని మరమ్మతు చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. మే 10వ తేదీన బ్రహ్మ రథోత్సవం కార్యక్రమం జరగాల్సి ఉండగా ఇంతలో ఈ సంఘటన జరిగింది. 400 సంవత్సరాల క్రితం తయారుచేసిన ఈ రథం శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త రథం తయారు చేయాలని భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయ అధికారులకు విరాళాలు అందజేశారు. గత మూడు సంవత్సరాలుగా భక్తులు రూ.76లక్షలు రథం నిర్మాణానికి విరాళాల రూపంలో అందింది. ఇంత మొత్తంలో విరాళాలు అందినా కొత్త రథాన్ని తయారు చేయించడంలో ఆలయ అధికారులు జాప్యం చేశారు. శనివారం రోజు కూడా నిపుణుల పర్యవేక్షణ లేకుండానే కొంతమంది స్థానిక కార్పెంటర్లతో క్రేన్ల సహాయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా మరమ్మతులు చేయడం వల్ల ఈ సంఘటన జరిగిందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెన్న అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తుల నుంచి ఆదాయం వస్తోంది. దీంతో పాటు దాదాపు 2134 ఎకరాల దేవాలయ మాన్యం ఉంది. ఈ భూముల లీజుదారుల నుంచి సంవత్సరానికి 40 లక్షల రూపాయలు ఆదాయం వస్తోంది. అంతేకాకుండా సంవత్సరానికి హుండీ ద్వారా కోటి రూపాయల వరకు ఆదాయం వస్తోంది. ఇంతటి ప్రాచుర్యం పొందిన ఆలయానికి నూతన రథం తయారు చేయించడంలో దేవాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి కారణం ఎమిటన్న ప్రశ్నలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.

యథావిధిగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తాం

ఆలయ ఈవో విజయ్ కుమార్

మే 2వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగే పెన్న అహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు యథావిధిగా కొనసాగుతాయని ఆలయ ఈవో విజయ్ కుమార్ తెలిపారు. రథం కిందపడడంపై భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా స్థాయి దేవాదాయ శాఖ అధికారులు, స్థానికుల సహకారంతో రథోత్సవం యథావిదంగా జరిగేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

ఈదురుగాలులు..వర్ష బీభత్సం

దెబ్బతిన్న పంటలు - లబోదిబోమంటున్న రైతులు - ఉల్లికల్లులో పిడుగుపాటు..మూడు గడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షబీభత్సం సృష్టించింది. రాత్రి 11 గంటల సమయంలో భారీ ఈదురుగాలు వీయడంతో గ్రామాల్లో విద్యుత్ స్తంబాలు నేలకూలాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మిడుతూరు రోడ్డుకు మధ్యలో చెట్టు కూలిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మండల వ్యాప్తంగా 45 విద్యుత్ స్తంబాలు కూలినట్లు ట్రాన్స్‌కో ఎఇ షఫీవుద్దీన్ తెలిపారు. అలాగే కాశేపల్లి, కొత్తపల్లి, విరుపాపురం, చిత్రచేడు, చింతలచెరువు తదితర గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న ఉద్యానశాఖ అధికారిణి మిత్ర, ఎఇఒ కైలాస్, తదితరులు శనివారం ఉదయం దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మండలవ్యాప్తంగా 43ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు.

గుత్తి మండలంలో రాలిన మామిడి కాయలను ఏరుతున్న దృశ్యం

గుత్తి : పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి కురిసిన ఈదుర గాలులతో కూడిన వర్షానికి వివిధ గ్రామాల్లో మామిడికాయలు నేలరాలాయి. ధర్మాపురం గ్రామంలో రైతు కష్ణారావు 4.5 ఎకరాల్లో సాగు చేసిన 320 మామిడి చెట్లకు మామిడికాయలు రాలిపోయాయి. దీంతో సుమారు రూ.2 లక్షలు నష్టపోయానని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే కరిడికొండ గ్రామంలో రంగనాయకులు సాగు చేసిన మామిడి చెట్లకు కాయలు రాలిపోవడంతో రూ.3 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఊటకల్లు గ్రామంలో టి.సురేష్, నారాయణ, కోదండరాముడు, నాగప్ప అనే రైతులకు చెందిన మామిడి చెట్ల కాసిన కాయలు వర్షానికి రాలిపోయాయి. రూ.లక్షల్లో నష్టపోయామని వాపోయారు. మామిడి పంట చేతికందే సమయంలో అకాల వర్షాలకి రాలిపోవడంతో తాము ఆర్థికంగా నష్టపోయామని, ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరారు.

పెద్దవడుగూరు మండలంలో కూలిన విద్యుత్ స్తంభాలు

వరి రైతులను ఆదుకోవాలి

ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, సహాయ కార్యదర్శి భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల

నిన్న రాత్రి కురిసిన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి దెబ్బతిన్న వరి రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు మండల పరిధిలోని తరిమెల గ్రామంలో వర్షానికి నీట మునిగిన వరిపంటను రైతుసంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిన్న రాత్రి కురిసిన భారీ వర్షానికి వరిపంట పూర్తిగా నీట మునిగిందన్నారు. దీంతో రైతులు భారీగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు దాదాపుగా రూ.35వేల నుంచి రూ.40వేల వరకూ పెట్టుబడి సాగు చేస్తే ఇలా ఉన్నట్టుండి నష్టపోతే అప్పులు ఎలా తీర్చాలని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి ఎకరాకు రూ.50వేల పంట నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మండలంలోని ఉల్లికల్లు గ్రామంలో పడిన పిడుగుపాటుకు పశుగ్రాసం దగ్ధమైనట్లు తెలుసుకున్న రైతుసంఘం నాయకులు గ్రామానికి చేరుకుని రైతులను పరామర్శించారు. పిడుగుపాటుకు రైతులు శివారెడ్డి, రామాంజనేయులురెడ్డి, మహేశ్వర్‌రెడ్డికి చెందిన మూడు గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయన్నారు. ఫలితంగా ఒక్కో రైతుకు సుమారు రూ.లక్ష వరకూ నష్టం వాటిల్లిందన్నారు. పశుగ్రాసం నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, గంప మల్లయ్య, ఆవుల రామంజి, మల్లేష్, రామాంజనేయులు, నల్లప్ప, ఎదునందన, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల మండలం తరిమెలలో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు

ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఆర్‌డిఒ నిశాంత్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకుంటే త్వరగా బిల్లులు మంజూరవుతాయన్నారు. ఆయా కాలనీల్లో ఇప్పటికే రోడ్లు, నీరు, విద్యుత్ వంటి మౌలికవసతులుకల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇఇ ఎం.శైలజ, ఎఇ వై.రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ నిశాంత్‌రెడ్డి

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

తాడిపత్రి : ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేసవికాలం క్రికెట్ శిక్షణను యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోచ్ భార్గవ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఆర్డీటీ సంస్థ జిల్లావ్యాప్తంగా క్రికెట్ శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో వచ్చేనెల 1వ తేదీ నుంచి క్రికెట్ శిక్షణను ప్రారంభించనున్నట్లు తెలిపారు. తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో ఉన్న యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్..93476 40651, 90599 69794 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా..!

◆ ఏపి జెఎసి అమరావతి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట
◆ సచివాలయ ఉద్యోగుల ధర్నా
◆ ఉద్యోగ, కార్మిక సంఘాల మద్దతు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వానికి పట్టవా అని ఏపీ జెఎసి అమరావతి నాయకులు తెలిపారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ అమరావతి జిల్లా ఛైర్మన్ ఆర్‌ఎన్.దివాకర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పిఎస్.ఖాన్ ఆధ్వర్యంలో శనివారం నాడు జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఉద్యోగ, కార్మిక సంఘాల నేతలు మద్దతుగా హాజరయ్యారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, సిఐటియు నగర కార్యదర్శి వై.వెంకటనారాయణ, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, జిల్లా అధ్యక్షులు రాజేష్‌గౌడ్, మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, పంచాయతీరాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మురళీధర్, టైపిస్ట్, స్టెనోగ్రఫీల అసోసియేషన్ అధ్యక్షులు ప్రసాద్, పశుసంవత్సర్ధక శాఖ ఉద్యోగుల యూనియన్ శ్రీనివాసులు, రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ కోశాధికారి మారుతి ప్రసాద్‌రెడ్డి, విఆర్‌ఒల సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనరసయ్య, మైనర్ ఇరిగేషన్ శాఖ ఉద్యోగుల యూనియన్ రామకృష్ణ, అనిల్, శివ, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల యూనియన్ నాయకులు మద్దతుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్ దివాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి పిఎస్.ఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇది మంచిది కాదన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిన ప్రభుత్వం అందులో పని చేసే ఉద్యోగులను పట్టించుకోకపోవడం విచాకరం అన్నారు. మొదటి దశలో నియామించిన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల 9 నెలల కాలానికి బకాయిలు, రెండో విడతలో నియామకం అయిన ఉద్యోగుల 5 నెలల కాలానికి బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు సాధారణ బదిలీలు వెంటనే చేపట్టాలన్నారు. రోజువారి నిర్ధేశించిన పౌర సేవలు లక్ష్యాలు, పని ఒత్తిడి తగ్గించాలన్నారు. రూరల్ నుంచి అర్బన్‌కు విలీనం అయిన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సర్వీస్ మ్యాటర్స్, సీనియార్టీకి సబంధించిన అంశాలు మార్గదర్శకాలు తయారు చేయాలన్నారు. ఎనర్జీ అసిస్టెంట్ డిస్కమ్ ద్వారా కాకుండా ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు ఎపిజిఎల్ఐ బాండ్లు వెంటనే జారీ చేయాలన్నారు. వార్డ్ శానిటేషన్ ఎన్వీరాన్‌మెంట్ కార్యదర్శులకు మేస్త్రీ విధులు నుంచి విముక్తి కలిగించాలన్నారు. ఇహెచ్‌ఎస్ కార్డులు వెంటనే జారీ చేయాలన్నారు. ఎఎన్‌ఎంల మీద యాప్‌ల భారం తగ్గించాలన్నారు. మహిళా కార్యదర్శులకు బందోబస్తు డ్యూటీలు కేటాయించరాదన్నారు. గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు జీవో 149 అమలు చేసి డిడిఒ అధికారాలు కల్పించాలన్నారు. గ్రేడ్-2 విఆర్‌ఒలకు ప్రొబేషన్ డిక్లేర్ చేయాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్స్, వార్డ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీస్, ఎనర్జీ అసిస్టెంట్‌లకు ఉద్యోగోన్నతి ఛానల్స్ కల్పించాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్ సంబంధించి ఫ్రంట్ ఆఫీస్ డ్యూటీని సచివాలయంలోని అందరూ ఫంక్షనరీస్‌లో నిర్వహించేలా చేయాలన్నారు. సిపిటి పరీక్ష వల్ల ప్రొబేషన్ పూర్తి కాని గ్రేడ్ 2, విఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రేడ్ 5 వారికి వెంటనే సిపిటి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయ ఆర్గనైజేషన్ సెక్రటరీ సల్మాన్ బాషా, అధ్యక్షుడు అంజన్‌రెడ్డి, క్లాస్‌ఫోర్త్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట చెన్నప్ప, గ్రామ వార్డ్ సచివాలయల డివిజన్ అసోసియేషన్ మైలరప్ప, వెంకట రాఘవ, వినయ్, కులశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొన్న ఏపీ జెఎసి అమరావతి ఉద్యోగ సంఘం నాయకులు, కార్మిక సంఘం నాయకులు

మాట్లాడుతున్న డిఇఒ ఎం.సాయిరాం

పిఎం శ్రీకి ఎంపికైన పాఠశాలలు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

డిఇఒ ఎం.సాయిరాం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ప్రధానమంత్రి రైజింగ్ ఇండియా పథకం కింద ఎంపికైన పాఠశాలల నిధులు, ప్రతిపాదనలను సిద్ధం చేసి పంపాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరాం ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. శనివారం స్థానిక సైన్స్ సెంటర్‌లో పిఎంశ్రీకి ఎంపికైన పాఠశాలలు ప్రధానోపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూర్చనున్నట్లు తెలిపారు. పిఎం శ్రీకి ఎంపికయ్యేందుకు కృషి చేసిన ఆయా ప్రధానాపాధ్యాయులను డిఇఒ అభినందించారు.

ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

విద్యుత్తు కోతలను ఎత్తివేసి ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని సిపిఎం పట్టణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం స్థానిక ఆలూరు రోడ్డులో ఉన్న విద్యుత్ శాఖ డిఎఇ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతుంటే విద్యుత్ శాఖ అధికారులు మాత్రం కోతలు విధించడం బాధాకరమన్నారు. బిల్లులు మాత్రం గతంలో కన్నా రెండింతలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. రాత్రి వేళల్లో ప్రజలు మరీ ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేగాకుండా అనేక ప్రాంతాల్లో విద్యుత్ హెచ్చు,తగ్గులు సరఫరా అవుతుండటంతో ఇళ్లల్లోని ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోతున్నాయన్నారు. అలాగే విద్యుత్ కోతల కారణంగా రాత్రి సమయంలో చోరీలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైన విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ కోతలను నిరోధించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యవర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, మారుతీప్రసాద్, జగ్గలి రమేష్ బాబు, కమిటీ సభ్యులు రాముునాయక్, ఓబులేసు, అబ్దుల్లా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు, ప్రజలు

ర్యాంకులు సాధించిన విద్యార్థులతో శ్రీచైతన్య కళాశాల సిబ్బంది

జెఇఇలో 'శ్రీచైతన్య' విజయకేతనం

ప్రజాశక్తి అనంతపురం

జెఇఇ మెయిన్స్ ఫలితాలలో అనంత శ్రీచైతన్య విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. కళాశాలకు చెందిన జవహర్ 3,242 ర్యాంకు, గౌతమ్‌సాయి 6,808, కాజీ రిజా 9,237, సాయి దివ్యనైన 14,122, పవన్ కార్తికేయ 14,358, సంజయ్‌కుమార్ 21,088, దినేష్‌రెడ్డి 30,063 ర్యాంకులు సాధించి ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపళ్లు ఆంజనేయులు, దుర్గేష్, రవికుమార్, కిషోర్‌కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

ర్యాంకులు సాధించిన విద్యార్థులు

మొదలైన రాజకీయ సందడి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమవుతోంది. వచ్చే నెలతో వైసిపి పాలన నాలుగేళ్లు పూర్తవనుంది. ఇక మిగిలింది ఆఖరు సంవత్సరమే. దీంతో అప్పుడే రాజకీయ సందడి మొదలైంది. అటు టిడిపి, ఇటు వైసిపి రెండింటిలోనూ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకుల్లో కదలిక మొదలైంది. అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. అంతక మునుపు టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాదయాత్ర జిల్లాలో ముగిసింది. ఇది ముగియగానే సిఎం జగన్ నార్పల మండల కేంద్రంలో నిర్వహించిన వసతి దీవెన పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జయప్రదం చేయడానికి అధికారులు , ఇటు పార్టీ నాయకులు కష్టపడ్డారు. భారీ జనసమీకరణ చేపట్టారు. ఇక్కడ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం గురించి చెబుతూనే మీరే నా నమ్మకం అంటూ రాబోయే ఎన్నికలను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు చెప్పే మాయమాటలు నమ్మవద్దని చెప్పడం ఒక రకంగా రాజకీయ చర్చకు దారితీసింది. ఇదే సమయంలో వైసిపిలోనూ గ్రూపు తగాదాలు బహిర్గతమవడం చర్చనీయాంశమైంది. శింగనమల ఎస్సి రిజర్వు నియోజకవర్గంలో ఎస్సిలను అణగదొక్కే ప్రయత్నం సాంబశివారెడ్డి చేస్తున్నారని చామలూరు రాజగోపాల్ ఆరోపించారు. ఇది సద్దుమణగక ముందే

యల్లనూరు పోలీసు స్టేషన్ ముందు తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి నిరసనకు దిగారు. దీనికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి స్పందించారు. ఇలా వైసిపిలో గ్రూపు విభేదాలు ఎన్నికలకు ముందు రచ్చకెక్కాయి. ఇది ఇలాగుంటే మాజీ మంత్రి డాక్టర్ శైలజానాథ్‌ని మాజీ ఎంపి జెసి.దివాకర్‌రెడ్డి కలువడం మరో చర్చకు దారితీస్తోంది. టిడిపి బలమైన వ్యక్తుల కోసం అన్వేషణ మొదలు పెట్టిందన్నది చర్చనీయాంశంగా మారింది. ఇక ప్రభుత్వం, అధికారుల తీరుకు వ్యతిరేకంగా జెసి.ప్రభాకర్‌రెడ్డి పురపాలక సంఘం కార్యాలయం వద్ద నిరసన కొనసాగిస్తున్నారు. అక్కడే భోజనం, స్నానాలు, నిద్ర కొనసాగిస్తున్నారు. రాప్తాడులోనూ టిడిపి, వైసిపిల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. అటు టిడిపి, ఇటు వైసిపిలోనూ రాజకీయ సందడి మొదలైంది. ఎన్నికల కోసం నాయకులు సమయత్తమవుతున్నారు. ఏ పార్టీకి ఎటువైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారన్న దానిపై దృష్టి పెట్టారు. పార్టీలు సైతం గెలుపు గుర్రాల కోసం అన్వేషణ మొదలు పెట్టాయి. సర్వేల ద్వారా అభ్యర్థులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నాయి. టిక్కెట్టు అనుమానం ఉన్న వారు పక్క పార్టీల వైపు చూపులు చూస్తున్నట్టు తెలుస్తోంది. వామపక్షాలు ఈ వారంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రచార భేరిన కొనసాగించారు. గ్రామాలు, పట్టణాల్లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఈ ప్రచారాన్ని కొనసాగించారు. అనంతపురం నగరంలో జరిగిన బహిరంగ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు బాబురావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రంలో బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. అదే సమయంలో రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్న బిజెపిని టిడిపి, వైసిపిలు ప్రశ్నించలేకపోవడాన్ని నిలదీశారు. ఇలా అన్ని రాజకీయ పార్టీల్లోనూ రాజకీయ సందడి మొదలైందనే చెప్పాలి. ఎన్నికల వాతావరణం అప్పుడే వచ్చేసిందా అన్నట్టుగా ఉంటోంది. ప్రచారాలు, విమర్శలు, ప్రతి విమర్శలు అన్ని వైపుల నుంచి పెరుగుతున్నాయి.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

మృతిచెందిన వ్యక్తి

గుత్తి : మండలంలోని జక్కలచెరువు రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న జీఆర్పీ పోలీసులకు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాడికి మండలం చందన గ్రామానికి చెందిన మురళి కొంతకాలంగా అనారోగ్యానికి గురయ్యాడు. ఆ బాధను భరించలేక రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఘటనపై జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కార్పొరేషన్ లో గుమస్తాల బదిలీలు

అనంతపురం కార్పొరేషన్ : మున్సిపల్ కార్పొరేషన్ లోని పరిపాలన విభాగంలో అకౌంట్స్ సెక్షన్లో బివన్ గుమాస్తాగా సుగుణాను బదిలీ చేశారు విద్యా విభాగంలోని సీబి2 గుమాస్తాగా పెద్దక్కని బదిలీ చేశారు సునీల్ ను స్పందన సీటు గుమాస్తాగా మార్చారు దామోదర్ ను శారదా మున్సిపల్ హై స్కూల్ కు బదిలీ చేశారు అకౌంట్స్ విభాగంలో ఫైళ్ల కదలికలో తీవ్ర జాప్యము జరగటానికి సునీల్ ను ప్రధాన కారణంగా పేర్కొంటూ ఇటీవలనే నాలుగు నెలల క్రితం బి వన్ గుమస్తాగా బాధ్యతలు స్వీకరించిన సునీల్‌పై వేటు పడింది

'ఐఎన్‌టిఎస్'లో 'శ్రీ చైతన్య' ప్రభంజనం

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం : కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ఐఎన్‌టిఎస్ ఒలింపియాడ్ రెండవ లెవెల్‌లో ప్రభంజనం సృష్టించారు. అత్యధిక సంఖ్యలో సర్టిఫికెట్లు, మెడల్స్ సాధించారు. గోల్డ్‌మెడల్స్ 117, మెరిట్ సర్టిఫికెట్స్ 196, కన్సోలేషన్ 33, స్పెషల్ ప్రైజ్ ఫస్ట్ ప్రైజ్ 1 సాధించినట్లు తెలిపారు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులను ఎజిఎం సుబ్బారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుం, డీన్లు రీషిబాల, అప్పలనాయుడు, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఏవో గోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

సక్రమంగా రేషన్ అందించాలి

బొమ్మనహాల్ : మండలంలోని డీలర్లు లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ సరుకులు అందించాలని తహశీల్దార్ శ్రీనివాసులు సూచించారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 13 వేల మందికి ప్రభుత్వం చౌకధ్యాన్యపు డిపోల ద్వారా నిత్యావసర సరుకులు అందిస్తోందన్నారు. కావున డీలర్లు కూడా సక్రమంగా పని చేసి సకాలంలో సరుకులు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బాలకృష్ణ, విఆర్ఒలు సుజాత, పర్వీన్ భాను, గోపాల్, యుగంధర్ వినయ్‌కుమార్‌రెడ్డి, రవి, నరసింహమూర్తి, రామన్న, వన్నూరప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అవగాహన

డి.హీరేహాల్ : హౌసింగ్ డేను పురస్కరించుకుని ఎంపిడిఒ భాస్కర్‌బాబు అధ్యక్షతన శనివారం మండల కేంద్రంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఇళ్లుమంజూరైన లబ్ధిదారులు వెంటనే గృహ నిర్మాణాలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి హసీనాభాను, సర్పంచి లక్ష్మి, ఎంపిటిసి బళ్లారి లింగప్ప, మహేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

ఎమ్మెల్యే పద్మావతి దంపతులకు రుణపడి ఉంటాం

నార్పల : ముఖ్యమంత్రితో కలిసి వేదిక పంచుకునే గొప్ప అవకాశాన్ని కల్పించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డితోపాటు తమ రాజకీయ గురువు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డికి ఎల్లవేళలా రుణపడి ఉంటామని జడ్పీ వైస్‌ఛైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న నార్పలలో నిర్వహించిన జగనన్న వసతి దీవెన కార్యక్రమానికి సిఎం జగన్ వచ్చిన విషయం తెలిసిందే అన్నారు. రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని సిఎంతో కలిసి నార్పలలో నిర్వహించడం ఎంతో అదృష్టకరమన్నారు. ఇంత గొప్ప కార్యక్రమంలో ముఖ్యమంత్రితోపాటు తమకు స్టేజిపై కూర్చొనే అవకాశం కల్పించడం మరింత సంతోషకరమన్నారు.

గ్రామాల్లో జెసి అస్మిత్‌రెడ్డి పర్యటన

యాడికి : మండల పరిధిలోని భోగాలకట్ట, నగరూరు గ్రామాల్లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జెసి అస్మిత్‌రెడ్డి శనివారం విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోగాల కట్ట గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి మాజీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డిని పరామర్శించారు. నగరూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో రహదారి సమస్యను స్థానికులు విన్నవించగా తాము అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, పరిమి చరణ్, రవికుమార్‌రెడ్డి, రాజశేఖర్, రవికుమార్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, నాగముణిరెడ్డి, నగరూరు నరసింహులు, నాగేశ్వర్‌రెడ్డి, కూచి వేణు, భాస్కర్‌రెడ్డి, అశ్వర్థరెడ్డి, త్రినాథ్‌రెడ్డి, దేవేంద్ర, రామునాయక్, దడియాల ఆది, బొట్టు శేఖర్, మధు రాజు, తాంద్ర విక్రమ్, నీలకంఠారెడ్డి, తిరంపురం నీలకంఠ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

చెర్లోపల్లి సచివాలయం తనిఖీ

పుట్లూరు : మండల పరిధిలోని చెర్లోపల్లి సచివాలయాన్ని ఎంపిడిఒ యోగానందరెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ సిటిజెన్ ఔట్రీచ్ ప్రోగ్రాం, హౌసింగ్ లబ్ధిదారులతో ఇకెవైసి చేయించడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి చిన్నపిల్లలు, గర్భిణుల వివరాలు నమోదు చేయడం వంటి వాటిపై సమీక్షించారు. అనంతరం బయోమెట్రిక్ హాజరు, మూమెంట్ రిజిస్టర్, స్పందన వంటి వాటిని పరిశీలించారు. అనంతరం గ్రామంలో హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జగనన్న లేఅవుట్‌లో నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బిల్లులు స్టేజ్ వారీగా పడుతున్నాయా.. లేదా.. సిమెంట్, ఇసుక ఇస్తున్నారా.. అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఇంజినీర్ లోకేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బ్రహ్మేశ్వరి, గ్రామ రెవెన్యూ అధికారి శ్రీనివాసులు, సచివాలయం సిబ్బంది, నాయకులు మూలి వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలి

ఉరవకొండ : వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని విడపనకల్ మండల వ్యాప్తంగా తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి, జడ్పిటిసి హనుమంతు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా భూములకు సంబంధించిన సమస్యలు, విద్యుత్ శాఖ, హౌసింగ్ సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని పలువురు సభ్యులు కోరారు. అయితే సర్వసభ్య సమావేశానికి మండల పరిధిలోని పలుశాఖల అధికారులు రాకపోవడంపై కొంతసేపు గందరగోళం నెలకొంది. గత జనరల్ బాడీలో చర్చించిన సమస్యలు ఇంకా పరిష్కారం కావడం లేదంటూ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక నుంచి జరిగే జనరల్‌బాడీకి తప్పనిసరిగా అధికారులతో పాటు ఎంపీటీసీలు వచ్చేవిధంగా చూడాలని కోరారు. ఈ సమావేశంలో విడపనకల్ పిఎసిఎస్ సొసైటీ ఛైర్మన్ బి.శ్రీరాములు, తహశీల్దార్ బ్రహ్మయ్య, ఎంపిడిఒ శ్రీనివాసులు, మండల స్థాయి అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

జెఇఇ ఫలితాల్లో 'ఎస్ఆర్' ప్రభంజనం

ప్రజాశక్తి -అనంతపురం

విజయకేతనం చూపుతున్న ఎస్ఆర్ పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులు

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. వివిధ కేటగిరీల్లో పఠాన్‌హర్బానుఖాన్ 550 ర్యాంకు, దూదేకుల మోనియా బేగం 740, శివకుమార్ గారి సునీల్‌కుమార్ 786, ఎరుకుల చిన్ననాగన్న 7067, కళ్యాణ్‌నాయక్ 12,327, విష్ణువర్ధన్‌నాయక్ 13,127, ప్రశాంత్ 16,268, జీవన్‌కుమార్‌నాయక్ 17,789వ ర్యాంకులు సాధించినట్లు అనంతపురం జోనల్ ఇన్‌ఛార్జి ఎం.శివకుమార్ తెలిపారు. ఈమేరకు శనివారం సాయంత్రం నగరంలోని రుద్రంపేటలో ఎస్ఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

నలంద విద్యార్థుల జయకేతనం...

విజయకేతనం చూపుతున్న నారాయణ విద్యార్థులు, అధ్యాపకులు

ప్రజాశక్తి-అనంతపురం

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో స్థానిక నలంద జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ ఎం.ఖాజీబాబు తెలిపారు. తమపాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ఎం.ప్రజ్ఞశ్రీ జాతీయస్థాయిలో 2,017 ర్యాంకు, ఎ.విశ్వేశ్వరరెడ్డి 4,568 ర్యాంకు సాధించి కళాశాల టాపర్స్‌గా నిలిచినట్లు తెలిపారు. మరో 10 మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు. ఉత్తమ ప్రతిభను కనబరచిన విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాల సిబ్బందిని ప్రిన్సిపళ్లు ఎం.ఖాజీబాబు, జె.వినోద్‌బాబు, కర్ణాటక, ఆంధ్ర రీజినల్ హెడ్ కేతినేని మాధవరావు, నలంద విద్యాసంస్థల ఛైర్మన్ అట్లూరి విజయబాబు అభినందించారు.

ప్రజలపై భారాలు మోపే చర్యలు ఉపసంహరించాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

'ఇదేం ఖర్మ'లో టిడిపి నేతలు

పోస్టర్లను విడుదల చేస్తున్న టిడిపి నాయకులు

నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్, గ్యాస్ ధరలు పెంపుదల చేసి ప్రజలపై భారాలు మోపి నడ్డీ విరిస్తోందని, ఇలాంటి చర్యలు ఉప సంహరించుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ, నగర అధ్యక్షులు మారుతికుమార్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధులు సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్‌లు అన్నారు. శనివారం నగరంలోని 40వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు శ్రీనివాస్‌చౌదరి, గుజ్జల రవికుమార్ ఆధ్వర్యంలో ఆజాద్ నగర్‌లో ఇదేమి ఖర్మ ఈ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ అనుసరిస్తున్న విధానాలు, ప్రజలపై మోపుతున్న భారాలను తెలియజేస్తూ కరపత్రాలు పంపిణి చేస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాబోవు రోజుల్లో టిడిపిని గెలిపించుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటేనే ప్రజల కష్టాలు తీరుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర మహిళా అధ్యక్షురాలు విజయశ్రీ రెడ్డి, రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి తేజస్వినీ, మాజి కార్పొరేటర్ సరళ, వరలక్ష్మి, వెంకట లక్ష్మి, రవి చౌదరి, గోపాల్‌గౌడు, సుధాకర యాదవ్, కాకర్ల ఆది, హెూన్నురు, బోయ శీన, సున్నం శ్రీనివాసులు, పావురాల శేఖర తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మందులు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తాం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

దుకాణాల్లో కాలం చెల్లిన మందులు, నకిలీ మందులు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని వ్యవసాయ శాఖ ఎడిఎ వెంకటరాముడు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ధాన్యరాసి రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ, సహకార సంస్థను పరిశీలించారు. అంతకుమునుపు రాత్రి కురిసిన వర్షానికి పంటనష్టం వివరాలను రైతు భరోసా ఇన్‌ఛార్జిలను వివరించారు. పిఎం కిసాన్ కోసం దరఖాస్తు చేసుకోని రైతులతో దరఖాస్తు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వైష్ణవి స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

నృత్యం చేస్తున్న చిన్నారులు

తాడిపత్రి రూరల్ పరిధిలో ఉన్న వైష్ణవి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ఛైర్మన్ బిందెల కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూవిద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలను అలవాటు చేసుకోవాలన్నారు. అంతేకాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పిల్లలకు విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల సెక్రెటరీ బిందెల సౌజన్య మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంగా చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారన్నారు. అలాగే విద్యార్థులు ఆటపాటలతోపాటు క్రమశిక్షణ నేర్చుకోవడం చాలా అవసరమన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను క్రమశిక్షణ ధోరణిలో పెంచాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపల్ సాయికృష్ణ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న వైష్ణవి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో విద్యార్థులు చదవడం ఎంతో అదృష్టమన్నారు. అదేవిధంగా కార్పొరేట్ స్కూలుకు దీటుగా తక్కువ ఫీజులతో విద్యను అందించడం తమకు గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యంతో పాటు సిబ్బంది, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

యాడికి : మండలంలోని కబడ్డీ క్రీడాకారులకు గుడిపాడు సర్పంచి దండు సావిత్రి శనివారం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దండు రాముడు, రాజశేఖర్, నాగమణి, పెద్దపుల్లయ్య రమణ తదితరులు పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో 'నారాయణ' ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

ర్యాంకులు సాధించిన విద్యార్థులతో నారాయణ కళాశాల సిబ్బంది

ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి జెఇఇ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో అనంతపురం నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగరవేశారు. కళాశాలకు చెందిన నిఖిల్, అగ్నిహోత్రి 300 మార్కులకు 259 సాధించి జాతీయస్థాయి ఓపెన్ క్యాటగిరీలో 650 ర్యాంకు సాధించారు. ఇదేక్రమంలో అనంతపురంలో ఇంతవరకు ఎవరూ సాధించని వెయ్యిలోపు ర్యాంకును కైవసం చేసుకున్నాడు. ఉత్తమ ర్యాంకులు సాధించిన వారిలో బొజ్జ ప్రశాంతి సిఆర్ఎల్– పిడబ్ల్యుడి 271వ ర్యాంకు, అభిరామ్ ఎస్టీ విభాగంలో 2004, ఇబ్రహీం ఎస్‌టి విభాగంలో 2070, వెంకట భవదీప్ 2752, ప్రీతం ఎస్సీ విభాగంలో 3945, వెంకటపవన్ 4347, దివ్యశ్రీ 8128, సాయికుమార్ 9823, అభిలాష్ 11390, సౌమ్య 122008 ర్యాంకులు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించి కళాశాల ఖ్యాతిని వినిపించిన విద్యార్థులను అనంతపురం కోర్ డీన్ బద్రీనాథ్ డీజీఎం వెంకట్రామిరెడ్డి, డిం.శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఓబన్నగౌడ్, హిమబిందు, శిఖామణి, ఎజిఎం హరిప్రసాద్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ర్యాంకులు సాధించిన నారాయణ కళాశాల విద్యార్థులు

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు రెన్యువల్ చేయాలి

కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలరంగయ్య, రంగారెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్లులో బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతుసంఘం నాయకులు

అసలు, వడ్డీ కట్టించుకోకుండా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులకు పంట రుణాలు పెంచి రెన్యువల్ చేయాలని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలరంగయ్య, రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరులో ఉన్న గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్‌లో అతివృష్టి, అనావృష్టి వల్ల రైతులు సాగుచేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. కనీసం పశుగ్రాసం కూడా దొరకని పరిస్థితి అన్నారు. కావున మార్ట్‌గేజ్‌తో సంబంధం లేకుండా రైతులకు పంట రుణాలు రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్‌బిఐ అకౌంట్, కెసిసి అకౌంట్‌కు ప్రత్యేక పాస్ బుక్‌లిచ్చి ఎంట్రీలు నమోదు చేయాలన్నారు. బ్యాంకుల వద్ద తాగునీటితోపాటు నీడ ఉండే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. అడంగల్ లేకుండా వన్‌బి ఆధారంగా రైతులకు పంట రుణాలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు బసన్న గౌడ్, గోవిందప్ప, కుబేర, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : అసలు, వడ్డీ కట్టించుకోకుండా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పెంచి పంట రుణాలను రెన్యువల్ చేయాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు సావిత్రమ్మ డిమాండ్ చేశారు. ఈమేరకు ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఖరీఫ్‌లో జిల్లాలో నెలకొన్న అతివృష్టి, అనావష్టి కారణంగా పంటలు పూర్తిగా నష్టపోయారన్నారు. ఎక్కువ శాతం పొలాల్లోనే మొలకెత్తి దిక్కుతో

ఆత్మకూరులో బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు సావిత్రమ్మ, తదితరులు

స్థితిలో రైతులు ఉన్నారన్నారు. కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొందన్నారు. కావున ప్రభుత్వ స్పందించి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతోపాటు బీమా వర్తించేలా చూడాలన్నారు. అంతేగాకుండా అసలు, వడ్డీ కట్టించుకోకుండా రుణాలు రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్, ఎన్‌పిఆర్‌డి మండల కార్యదర్శి రామయ్య, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణవేణి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి జయమ్మ, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలకు అసలు వడ్డీ లేకుండా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు పెంచి రెన్యూవల్ చేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు టి.రామాంజినేయులు డిమాండ్ చేశారు. శనివారం మన్నిల రైతులతో కలిసి రైతు సంఘం ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ వద్ద ఉన్న కెనరాబ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు జిల్లాలో రైతులు ఇబ్బందులు పడుతున్న దృశ్య పంట రుణాలు పెంచి రెన్యూవల్ చేయాలని కోరారు. మార్టిగేజ్ లేకుండా రూ.5 లక్షల వరకు రుణాలు ఇవ్వాలన్నారు. ఎస్‌బి. అకౌంట్, కెసిసి అకౌంట్‌కు ప్రత్యేకంగా అకౌంట్ బుక్కులు ఇచ్చి, ఎంట్రీలు రెగ్యులర్‌గా నమోదు చేయాలన్నారు. బ్యాంకుల వద్ద తాగునీరు, నీడ ఏర్పాటు చేయాలన్నారు. అడంగల్ లేకుండా 1 బి ఆధారంగా పంట రునాలు రెన్యూవల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మునయ్య, పుష్పరాజు, చంద్రశేఖర్, భాగ్యలక్ష్మి, తిరుపాలు, దివాకర్ నాయుడు, రాము, లక్కప్ప తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర జీవనోపాధి కోసమే మెప్మా అర్బన్ మార్కెట్

మేయర్ మొహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మెప్మా మార్కెట్‌ను ప్రారంభిస్తున్న మేయర్ వసీం

సుస్థిర జీవనోపాధి కల్పించడంలో భాగంగా ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని మేయర్ మొహమ్మద్ వసీం పిలుపునిచ్చారు. సుస్థిర జీవనోపాదుల కల్పనలో భాగంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన నగరపాలక సంస్థ పరిధిలో మెప్మా అర్బన్ మార్కెట్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఈ మార్కెట్ ద్వారా మహిళా సంఘాల సభ్యులు తాము రూపొందించిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడం సులభతరం అవుతుందన్నారు. ఇందుకోసం పట్టణ స్వయం సహాయక సంఘ సభ్యులకు మెప్మా ద్వారా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. వైఎస్ఆర్ చేయూత పథకం కింద 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారికి రాష్ట్ర ప్రభత్వం ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ వర్గాల మహిళలకు ఏటా రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో 75,000 ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. అంతేగాకుండా మహిళలు ఎంచుకున్న జీవనోపాదులకు అవసరమైన సాంకేతిక, మార్కెటింగ్ సహకారాలు అందించేందుకు వివిధ బహుళ జాతిసంస్థలతో ఒప్పందాలు చేసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే అమూల్, హిందుస్తాన్, యునిలివర్, ఐటిసి, ప్రోక్టర్ అండ్ గ్యాంబుల్ లాంటి కంపెనీలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు విజయభాస్కర్‌రెడ్డి వాసంతి కమిషనర్ రమణారెడ్డి, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, టౌన్ ప్రాజెక్ట్ అధికారిణి జె.విశ్వజ్యోతి, సిటిమిషన్ మేనేజర్ ఎ.శ్రీనివాసరెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు భువన, వైజయంతి, శిరీషా, పల్లవి, సుగుణ, వేణుగోపాల్, నారాయణస్వామి, సత్యమూర్తి, పీరా, లక్ష్మీనారాయణ, కాటమయ్య, రిసోర్స్‌పర్సన్స్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

రాయదుర్గం : వచ్చేనెల 1న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని సొసైటీ రాష్ట్ర కమిటీ సభ్యులు కాపు రామచంద్రారెడ్డి, జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి శనివారం ఒక ప్రకటనలో కోరారు. రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలు కావాలన్నారు. కావున రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

వీధిదీపాల ఏర్పాటుకు వినతి

రాయదుర్గం : పట్టణంలోని బిటిపి రోడ్డు వద్ద ఉన్న మోడల్ కాలనీలో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాయదుర్గం డివిజన్ కార్యదర్శి ఎస్‌వి ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. మోడల్ కాలనీలో వీధి దీపాలు లేకపోవడం వల్ల స్థానికులు రాత్రిళ్ల బయటికి వచ్చి విష పురుగులు, పాముల బారిన పడుతున్నారన్నారు. కావున పట్టణానికి దూరంగా ఉన్న మోడల్ కాలనీవాసుల సమస్యను దృష్టిలో ఉంచుకుని వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు.

మోక్షిత్ పాఠశాలలో 'అమ్మకు వందనం'

అనంతపురం : స్థానిక విన్సెంట్ ఫెర్రర్ నగర్‌లోని మోక్షిత్ పాఠశాలలో శనివారం అమ్మకు వందనం కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె.సుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు వై.లక్ష్మీసుబ్బారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకూ విద్యార్థులతో తల్లులకు పాదపూజ చేయించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కె.సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశీర్వాదాలు తీసుకోవాలన్నారు. మనం ఏం చేసినా తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేమన్నారు.

ఖాదర్ వలికి సన్మానం

ఉరవకొండ : సిరిధాన్యాల సృష్టికర్త పద్మశ్రీ ఖాదర్‌వలిని నిస్వార్థ, జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగమల్లె ఓబులేసు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. పద్మశ్రీ అవార్డు అందుకున్న తర్వాత మొట్టమొదటిసారి జిల్లాకు వచ్చిన సందర్భంగా ఆదరణ పాడిపంట రామకృష్ణతో ఖాదర్‌వలిని సన్మానించినట్లు తెలిపారు.

లక్ష్మీనారసింహుడి పల్లకిసేవ

ఉరవకొండ : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి పల్లకిలో మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్రహ్మంగారి ఆరాధన

పుట్లూరు : మండల పరిధిలోని చింతలపల్లి గ్రామ సమీపంలో వెలసిన బ్రహ్మంగారి ఆలయం వద్ద ఆదివారం ఆరాధన మహోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పూజారి గంగన్న ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం దాతల సహకారంతో శ్రీకోదండ రామ చెక్కభజన ఉంటుందన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న డిఇఒ

అనంతపురం సిటీ : నగరంలోని ఎస్‌ఎస్‌బిఎన్ పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు.

సిఎం జగన్‌కు మెజారిటీ ప్రజల మద్దతు

వైసిపి ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రవ్యాప్తంగా మెజారిటీ ప్రజల మద్దతు సిఎం జగన్‌కే ఉందని విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం రాయదుర్గంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్ముందు ప్రభుత్వ లబ్ధి కొనసాగాలంటే భవిష్యత్తులో కూడా ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి సూచించారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ద్వారా రాయదుర్గం నియోజకవర్గంలో 89,276 కుటుంబాలను కలిసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాలపై ఆరాతీయగా ప్రజలందరూ సంతృప్తిగా ఉన్నట్లు వివరించారు. అంతేగాకుండా జాతీయ సర్వే సంస్థ ఇటీవల వెల్లడించిన సర్వే ఫలితాల్లో రాష్ట్రంలో 24 పార్లమెంటు స్థానాలను వైసిపి గెలుచుకుంటుందని వెల్లడించడంతో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. 2024 ఎన్నికల తర్వాత టిడిపి పూర్తిగా కనుమరుగవుతుందన్నారు. ఈ సమావేశంలో వైసిపి పట్టణ కన్వీనర్ ముస్తాక్‌అహ్మద్, గుమ్మఘట్ట మండల కన్వీనర్ మంజునాథ, రాయదుర్గం పురపాలక సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నాయకులు మల్లికార్జున, గోవిందా, వన్నూరు స్వామి, తిమ్మారెడ్డి, పవన్ కుమార్, సత్యనారాయణ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : మా నమ్మకం నువ్వే జగనన్న నినాదంతో 'జగనన్నే మా భవిష్యత్' పేరుతో చేపట్టిన మెగా పీపుల్స్ సర్వేకు ప్రజల నుంచి అపూర్వ స్పందన వచ్చిందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం 40వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎవరూ చేయని విధంగా ఈనెల 7వ తేదీ

విలేకరులతో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

నుంచి 'జగనన్నే మా భవిష్యత్' మెగా పీపుల్స్ సర్వే నిర్వహించి ప్రజామద్దతు కోరినట్లు తెలిపారు. అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 85,865 కుటుంబాలను నేరుగా కలిసి సమస్యలు, ప్రభుత్వంపై ప్రజల అభిప్రాయం అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఇదే సమయంలో కొన్ని సమస్యలను కూడా గుర్తించామన్నారు. టిడ్కో ఇళ్ళు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలు, ఇంటి స్థలాలకు సంబంధించి పలు సమస్యలు తమ దృష్టికి వచ్చాయని.. వీటికి త్వరలోనే పరిష్కారం చూపుతామన్నారు. ఇప్పటికే వైసీపీ అధికారంలోకి వచ్చాక 25 వేల మందికి ఇంటి పట్టాలు అందించి నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రభుత్వం ఇంత పెద్దఎత్తున సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే ప్రతిపక్ష నేత చంద్రబాబు దుష్ప్రచారం చేయడం బాధాకరమన్నారు. ముఖ్యంగా సీఎం జగన్‌ను వ్యక్తిగతంగా దూషిస్తున్నారని మండిపడ్డారు. గతంలో చంద్రబాబుకు అధికారం ఇస్తే సంక్షేమాన్ని గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి ప్రజలను మోసం చేశాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఎం జగన్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు దూషణలకు దిగుతున్నారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా మరోసారి అధికారంలోకి వచ్చేది జగన్ నాయకత్వంలోని వైసిపి ప్రభుత్వమే అన్నారు. అంతకుముందు ఆజాద్‌నగర్‌లో కుమారి కుటుంబ సభ్యులకు వైఎస్ఆర్ బీమా కింద రూ.10 వేల తక్షణ సాయాన్ని ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ మొహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ ఫయాజ్, జెసిఎస్ కన్వీనర్లు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, చింతకుంట మధు, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ రిజ్వాన్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, వైసిపి నాయకులు ఖాదర్, షరీఫ్, సందీప్, ఇసాక్, నల్లప్ప, గుజ్జల లక్ష్మణ్, పార్వతి, మహబూబ్‌ఖాన్, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి అద్భుత స్పందన వచ్చిందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. శనివారం అనంతపురంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమంలో భాగంగా శింగనమల నియోజకవర్గంలో 85 శాతం కుటుంబాలను కలవగా జగనన్న ప్రభుత్వంపై ప్రజలు చూపించిన ఆధారాభిమానాలు మరువలేనివన్నారు. ముఖ్యంగా జగనన్న సంక్షేమ పథకాలు, నవరత్నాలు అన్నీ కూడా ఇంటి ముందుకే రావడం పెద్ద విజయమన్నారు. ఈనెల 26న జగనన్న మన నియోజకవర్గానికి వచ్చినప్పుడు స్వచ్ఛందంగా వచ్చిన జనాన్ని చూసి ప్రతిపక్షాలు తెల్లబోయాయన్నారు. అది జగనన్న మీద ప్రజలకు ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి నియోజకవర్గంలో ఉన్న సమస్యలకు తప్పకుండా పరిష్కారం చేస్తామని తెలిపారు. రెండోసారి విజయం సాధించిన తర్వాత ప్రతి మారుమూల పల్లెకు రహదారి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో సుమారు 7 లక్షల మంది గృహసారథులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వైసిపి అభిమానులు ఈ యజ్ఞంలో పాల్గొన్నారని తెలిపారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-తాడిపత్రి

పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎజిఎం సుబ్బారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఐదో తరగతి విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. అనంతరం ప్రైమరీ నుంచి హైస్కూలుకు వెళ్లే విద్యార్థులకు అకడమిక్స్‌కు సంబంధించి విషయాలను వివరించారు. అనంతరం ప్రిన్సిపల్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాలని, క్రమశిక్షణతో మెలగాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో డీన్ నాగభూషణం, ప్రైమరీ ఇన్‌ఛార్జి వైష్ణవి, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి సమీరా, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన దృశ్యం

పారిశుధ్యం, తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని మెజారిటీ వార్డుల్లో పారిశుధ్యం, తాగునీటి వంటి సమస్యలను పరిష్కరించాలని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ నంగినేని భవాని అధ్యక్షతన శనివారం స్థానిక కౌన్సిల్ సమావేశ భవనంలో సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే వైస్ ఛైర్‌పర్సన్లు మైమున్, నైరుతిరెడ్డితో పాటు అధికార పార్టీ కౌన్సిలర్లు విద్యారాణి, నాగరత్న, వై.సుధాకర్, టిడిపి కౌన్సిలర్లు పవన్ కుమార్‌గౌడ్, రామాంజనేయులు, షరీఫ్ తమ వార్డుల్లో పారిశుధ్య పనులు, తాగునీరు సరఫరా సక్రమంగా జరగడం లేదని ధ్వజమెత్తారు. కమిషనర్ రోజూ వార్డుల్లో పర్యటించి ఫోటోలు వాట్సప్ గ్రూపుల్లో పెడతారు తప్ప పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇందుకు ఛైర్‌పర్సన్ స్పందిస్తూ పారిశుధ్య పనులు, తాగునీరు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ బండి శేషన్నకు, సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య పనులను ఉన్న కార్మికులతో చేయిస్తున్నామన్నారు. సాంకేతిక లోపాలు కారణంగా తాగునీరు సరఫరాలో కొంత జాప్యం జరుగుతోందని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ

గుంతకల్లు సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ భవాని

సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ కెఎండి ఇస్సాక్, మెప్మా టిపిఆర్ఒ మోహన్, ఇంజినీర్లు, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్లు, లైటింగ్ సూపరింటెండెంట్ జి.అబ్దుల్‌బాషా, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పురపాలక మండలి సభ్యులు డిమాండ్ చేశారు. పురపాలక సంఘం అధ్యక్షురాలు పోరాళ శిల్ప అధ్యక్షత శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ముందుగా పట్టణంలో గత కొంతకాలంగా తాగునీటి ఎద్దడి తీవ్రంగా నెలకొందని,వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదని, ఏడాది వర్షాకాలంలో పట్టణంలో అనేక పల్లపు ప్రాంతాలు జలమయమై ప్రజాజీవనం అస్తవ్యస్తంగా మారిందని, మౌలిక సౌకర్యాలు కల్పించాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాగునీటి సరఫరాకు మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో ముంపు సమస్య తలెత్తకుండా త్వరలో టెండర్లు పిలిచి పనులు చేపడతామన్నారు. అనంతరం అజెండాలోని అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో మెజారిటీ సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో తూతూమంత్రంగా సాగింది. ముందుగా సభ ప్రారంభం కాగానే పలు సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. ఈ సమావేశంలో తహశీల్దార్ వేణుగోపాల్, ప్రత్యేకాధికారి రామ్మోహన్‌రెడ్డి, ఎంపిపి భవాని, వైస్ ఎంపిపి జయమ్మ రామకృష్ణారెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.